సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

రాములోరి పెళ్లికి.. ఊరంతా పందిళ్లు

- అంగరంగ వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు
- కమనీయంగా సీతారాముల కల్యాణం

మల్కాపురం: శ్రీరామనవమి సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు రామాలయాల్లో సీతారాముల కల్యాణ వేడుకులు అంగరంగ వైభవంగా గురువారం జరిగాయి. 61వ వార్డు మల్కాపురం పల్లివీధిలో సీతారాముల కల్యాణ వేడుకల్లో తొలుత స్వామి, అమ్మవార్లను పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణం జరిపారు. ఈ వేడుకల్లో కోరమాండల్ అధికారి సాయిగణేష్, ఆలయ కమిటీ పెద్దలు, విజయ బాలమిత్ర కళా సమితి ప్రతినిధులు, అగ్నికుల క్షత్రియ సంఘం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు. అన్న సమారాధ కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు దాడి సత్యనారాయణ, పార్టీ ఐటీ విభాగం ప్రతినిధి కొల్లి నూకరెడ్డి, బూస అప్పలరెడ్డి, వరలక్ష్మి, చట్టి నూకరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే రెడ్డివీధిలో జరిగిన కల్యాణంలో కార్పొరేటర్ సుధతో పాటు పార్టీ నాయకులు పిలక రామ్మోహన్‌రావు, కాకి పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నగరాలవీధిలో జరిగిన కల్యాణంలో కార్పొరేటర్ సుధతో పాటు ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. 58వ వార్డు పిలకవానిపాలెం, జింక్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద జరిగిన కల్యాణ వేడుకల్లో వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ, చుక్క వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. 59వ వార్డు హిమాచల్‌నగర్, నక్కవానిపాలెం తదితర ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్, వార్డు పార్టీ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్ పాల్గొన్నారు. 60వ వార్డు పరిధి జవహర్‌నగర్, ఇందిరాకాలనీ తదితర ప్రాంతాల్లో జరిగిన కార్యక్రమాల్లో వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: శ్రీరామనవమి సందర్భంగా గోపాలపట్నం, చంద్రనగర్, యల్లపువానిపాలెం, కొత్తపాలెం వెంకటాపురం, ప్రశాంతినగర్, బుచ్చిరాజుపాలెం, బాజి జంక్షన్, గవర వీధి, రెడ్డి వీధి, మర్రిపాలెం వుడా లేఅవుట్, కరాసా, విమాన్‌నగర్, కాకానినగర్, దుర్గానగర్ ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి. రామాలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మర్రిపాలెం వుడా లేఅవుట్ వరసిద్ధి వినాయక ఆలయంలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామి పాదాలు కడిగి కన్యాదానం చేయడం పూర్వజన్మ సుకృతంగా పరవశించి పోయారు.


కరాసాలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న డిప్యుటీ మేయర్ జియ్యాని శ్రీధర్


మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో కల్యాణం తిలకిస్తున్న భక్తులు


కొలువుదీరిన సీతారాములు

కల్యాణంలో పాల్గొన్న నాయకులు

గోపాలపట్నం, ఎన్‌ఏడీ ప్రాంతాల్లో జరిగిన కల్యాణ మహోత్సవాల్లో పలువురు నాయకులు పాల్గొని ఆలయాల్లో విశేష పూజలు చేశారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు కరాసా రామాలయంలో జరిగిన కల్యాణంలో పాల్గొన్నారు. ప్రశాంతినగర్‌లో నిర్వహించిన సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు. వెంకటాపురంలోని రామాలయాల్లో బెహరా విద్యా సంస్థల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

పలు దేవాలయాల్లో అన్నదానాలు

పలు దేవాలయాల్లో భారీ అన్నదానాలు నిర్వహించారు. కల్యాణం పూర్తయిన తర్వాత భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ చేశారు.

గొల్లకంచరపాలెం ఆలయంలో..

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గొల్లకంచరపాలెం ధనలక్ష్మి దేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి, సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రాజేటి రామాచరణాచార్యులు, రాజేటి గంగాధర్ శర్మ ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. పల్లా సత్యనారాయణ, నమ్మి రాజారమేష్ దంపతులు కలశ ప్రతిష్ట చేశారు. సుమారు 5 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం సీతమ్మకు సారె సమర్పణ, పల్లకీ ఊరేగింపు చేపట్టారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.


సీతారాములకు క్షీరాభిషేకం చేస్తున్న కోరమాండల్ సీనియర్ ఆఫీసర్ సాయిగణేష్


కొత్తపాలెం గణపతినగర్ సీతారామాలయంలో దర్శనం చేసుకున్న దొడ్డి కిరణ్

40 వార్డులో..

సింధియా: విశాఖ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో సీతారాములల కల్యాణ మహోత్సవాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సీతారాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. మల్కాపురం సీఐ లూథర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై సీతారాముల కల్యాణ మహోత్సవం జరిపించి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


షిప్‌యార్డ్‌లో డిపార్ట్‌మెంట్ వద్ద వేడుకల్లో పాల్గొన్న సీనియర్ మేనేజర్ రఘు, ఏజీఎం దాసు


మల్కాపురం పల్లివీధి అన్నసమారాదనలో పాల్గొన్న కార్పొరేటర్ కొణతాల సుధ

షిప్‌యార్డ్‌కాలనీలో..

షిప్‌యార్డ్‌కాలనీలోని పురాతన ఉమారామలింగేశ్వర ఆలయంలో శ్రీరామనవమిని ఆలయ అర్చకులు శ్రీనివాస్‌శర్మ ఘనంగా జరిపించారు. శ్రీరామ బాల భజన మందిరంలో బాలశ్రీ బాల భక్త సమాజం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామిక వేత్త సాలాపు చిన్నా, గల్లా శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని కల్యాణాన్ని జరిపించారు.

62వ వార్డులో....

జీవీఎంసీ 62వ వార్డు పరిధి త్రినాథపురంలోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వారి ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, భారతి దంపతుల చేతుల మీదుగా సీతారాముల ఉత్సవ మూర్తులను ఊరేగించి, అనంతరం కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 3 వేల మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక భక్తులు తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంతినగర్‌లో కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు


ఇండస్ట్రియల్ కాలనీలో సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్న నూతన దంపతులు


40వ వార్డు ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న గుండపు నాగేశ్వరరావు దంపతులు


షిప్‌యార్డ్‌కాలనీలో శ్రీ సీతారాములు కళ్యాణం జరిపిస్తున్న భక్తులు


62వ వార్డులో సీతారాముల కల్యాణం జరిపిస్తున్న బల్ల లక్ష్మణరావు దంపతులు

క్లుప్తంగా

బుద్ధుడి విగ్రహం ఏర్పాటుకు చర్యలు


బుద్ధుడి విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కళాకారులు

గోపాలపట్నం: మర్రిపాలెం వుడా లేఅవుట్ గ్రీన్ బెల్టు వాకింగ్ ట్రాక్‌లో బుద్ధుని విగ్రహం ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. టైల్స్ అమర్చి విగ్రహాన్ని అందంగా తీర్చిదిద్ది, త్వరలో ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ విగ్రహం ఏర్పాటు విషయమై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం


పిచ్చికుక్క దాడిలో గాయపడిన రామునాయుడు

గోపాలపట్నం: కొత్తపాలెంలో పిచ్చికుక్క స్వైరవిహారంతో పలువురుకి గాయాలయ్యాయి. దాన్ని పట్టుకునేందుకు ప్రయత్నించినా తప్పించుకుంది. ఈ ఘటనతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. నాగం అరుణ్ (4), ఎద్దు రామునాయుడును పిచ్చికుక్క గాయపరిచింది. వీరితో పాటు పలువురిని గాయపరిచినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ పిచ్చికుక్కని అధికారులు పట్టుకోవాలని కోరుతున్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సత్కారం


పెంటన్నను సత్కరిస్తున్న నాయకులు

సింధియా: హిందుస్తాన్ షిప్‌యార్డ్‌లో 39 ఏళ్ల సర్వీస్ చేసిన ఫ్రీ ఫైబర్‌కేషన్ సూపర్‌వైజర్ ఎం.పెంటన్నను షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ పొందిన పెంటన్న సేవలను కొనియాడుతూ వీడ్కోలు సభను ఏర్పాటు చేశారు. ఆయనకు పూల మాలలు వేసి, శాలువా కప్పి సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో చిత్తూరు ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కె.అప్పలకొండ, ప్రధాన కార్యదర్శి కె.అనిల్‌కుమార్, కమిటీ సభ్యులు, తోటి ఉద్యోగులు పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయంలో శాంతి హోమం

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు శీకువానిపాలెంలో కొలువుదీరిన నూకాంబిక అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో గురువారం శాంతి హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ హోమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కు ఎదురుగా గల చింత చెట్టు కిందనున్న జీవీఎంసీ స్థలంలో ములగాడ కనకరాజు అనే స్థానిక వ్యక్తి స్కూల్ బ్యాగులు కుట్టుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఎండ, పక్షులు వ్యర్థాలు వేసినా తన కుట్టు మిషన్‌పై పడకుండా ఉండేందుకు ఆ స్థలంలో కవర్ వేసుకున్నాడు. దీనిని గుర్తించిన సచివాలయం టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం రాత్రి సమయంలో పొక్లెయిన్ సాయంతో తొలగించారు. ఈ చర్యపై పారిశ్రామిక ప్రాంత దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం అక్కడ నిరసన చేపట్టారు. దళిత వ్యక్తి కనకరాజుకు న్యాయం చేయాలని, లేకుంటే తమ నిరసన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దళిత నాయకులు కాకర రమణ, కింతాడ రాజశేఖర్, గూడాల ఈశ్వరరావు, పూడి మల్లేశ్వరరావు, అనపర్తి తాతారావు, గుడాల బాబూరావు, సుధశాలిని పాల్గొన్నారు.

సుధాకర్‌రావు కుటుంబానికి పరిహారం అందజేత

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో బుధవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి పరిహారం అందజేశారు. హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ)లో పనిచేస్తున్న 61వ వార్డు మల్కాపురం ప్రకాష్‌నగర్‌కు చెందిన యడ్రపు సుధాకర్‌రావు.. ప్రమాదవశాత్తు ఇనుప రాడ్డు తలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. మృతుడి బంధువులు, పలు ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కాంట్రాక్టర్‌ను కోరారు. దీంతో సదరు కాంట్రాక్టర్ రూ.20 లక్షల పరిహారాన్ని ఇచ్చేందుకు సిద్ధం కావడంతో ఆ మొత్తానికి సంబంధించిన చెక్‌ను గురువారం 58వ వార్డులోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో మృతుడి భార్య విజయకు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బద్రీనాథ్, పార్టీ నాయకుడు దాడి సత్యనారాయణ, హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి మజ్జి సోమేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.


మృతుడి భార్యకు పరిహారం చెక్ అందజేస్తున్న నాయకులు

సీతంపేటలో మెగా పోస్టల్ మేళా

సీతంపేట: అక్కయ్యపాలెం సబ్ పోస్టాఫీస్ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద మెగా పోస్టల్ మేళా నిర్వహించారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మేళాను ప్రారంభించి మాట్లాడారు. తపాలా శాఖ అనేక రకాల పొదుపు పథకాలను అందజేస్తోందన్నారు. ఆర్‌డీ, డిపాజిట్లు, లైఫ్ ఇన్సూరెన్స్, సుకన్య సమృద్ధి పథకాల్లో ప్రజలు మదుపు చేసి అధిక లాభాలు, మీ డబ్బుకు పూర్తి రక్షణ పొందవచ్చని చెప్పారు. పోస్ట్‌మాస్టర్ ఏసు మాట్లాడుతూ పోస్టాఫీస్‌లో గాని, మీ ఇంటికి ఉత్తరాలు బట్వాడా చేసే పోస్ట్‌మ్యాన్, ఉమెన్ ద్వారా ఇంటి వద్దే డబ్బు చెల్లించి పోస్టల్ పథకాల్లో డిపాజిట్ చేయవచ్చని తెలిపారు. పోస్టల్ శాఖ అందిస్తున్న పలు పొదుపు పథకాలు, వాటి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమాన్ని వెస్ట్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షించారు. అక్కయ్యపాలెం సబ్ పోస్టాఫీస్ సిబ్బంది, పోస్ట్‌మ్యాన్‌లు, పోస్ట్ ఉమెన్‌లు పాల్గొన్నారు.


మెగా మేళాలో పాల్గొన్న కార్పొరేటర్ గోవింద్, పోస్టల్ సిబ్బంది

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవలో 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.రమేష్‌నాయుడు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.


తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లిస్తే దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నారు. భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

అప్పన్న రథ సామర్థ్యం పరిశీలన


రథాన్ని పరిశీలిస్తున్న ఆర్ అండ్ బీ ఈఈ రమేష్‌కుమార్ తదితరులు

సింహాచలం: వచ్చే నెల 2న జరిగే శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా నిర్వహించే రథోత్సవానికి సంబంధించి రథం సామర్థ్యాన్ని ఆర్ అండ్ బీ ఇంజినీరింగ్ అధికారులు గురువారం పరిశీలించారు. ఆ రోజు సింహగిరి మాడ వీధుల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని రథాన్ని లాగుతుంటారు. దీనిలో భాగంగా ఏటా రథం సామర్థ్యాన్ని ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి సర్టిఫై చేస్తారు. ఈ తరుణంలో సింహగిరికి వచ్చిన ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్‌కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యపణేశ్వర్.. రథాన్ని పరిశీలించారు. చక్రాలు, స్టీరింగ్, బొడ్డుబల్ల, తాళ్లు, తదితర వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రథోత్సవంలో పాటించాల్సిన జాగ్రత్తలను దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబుకు తెలియజేశారు.

ఘనంగా పుట్ట బంగారు మహోత్సవం

అగనంపూడి: అగనంపూడి అష్ట గ్రామాల ఆరాధ్య దైవం బొర్రమాంబ అమ్మవారి పుట్ట బంగారు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బొర్రమ్మ వనంలోని అమ్మవారిని భారీ ఊరేగింపుగా వేలాది మంది భక్తులు తీసుకు వెళ్లారు. బళ్ల వేషాలు, నేల వేషాలు, తప్పెటగుళ్లు, కోలాటాలు భారీ మందుగుండు సామగ్రి పేల్చి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అమ్మవారి ఊరేగింపు వెళ్లే మార్గంలో దారి పొడవునా మహిళలు రహదారులను పరిశుభ్రం చేసి, తోడ్కొని వెళ్లారు.

మన్యం బంద్‌కు మద్దతు

సింధియా: బోయ, వాల్మీకి గిరిజనేతరులను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఏపీ రాష్ట్ర గిరిజన సంఘం ఈ నెల 31న తలపెట్టిన మన్యం బంద్‌కు మద్దతు ప్రకటిస్తూ గురువారం సింధియాలోని షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. షిప్‌యార్డ్ రిక్రియేషన్ క్లబ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు కె.అప్పలకొండ మాట్లాడుతూ బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రద్దు చేయాలని, రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించాలని, గిరిజన స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేయాలనే పలు డిమాండ్లతో 31న మన్యంలో జరిగే బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. జిల్లా గిరిజన నాయకుడు జానకీరామ్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్‌తో పదవులు అనుభవిస్తున్న ఏడుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ గిరిజనేతరులైన బోయ, వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చడంపై తమ వైఖరిని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ సెల్ డిప్యూటీ ప్రెసిడెంట్ కె.కొండలరావు, ఎ.నారాయణరావు, సత్యనారాయణరావు, డి.వి.రమణ, లక్ష్మీనాయుడు, గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న షిప్‌యార్డ్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు

సింహాచలేశుడికి ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదిక్పై అధిష్టింపజేసి, 108 స్వర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు చిన్నా తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు శ్రీవరాహ నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మంపడంలో వేయింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జ్వరంతో చేర్పిస్తే రూ.2 లక్షల బిల్లు

కేర్ ఆస్పత్రిపై బాధితురాలి బంధువుల ఆరోపణ

మహారాణిపేట: టైఫాయిడ్ జ్వరంతో తన కుమార్తె(వైద్య విద్యార్థిని)ను విశాఖ కేర్ ఆస్పత్రిలో చేర్పిస్తే రూ.2 లక్షల బిల్లు వేసి వేధిస్తున్నారని ఆమె తండ్రి జయరామ్ ఆరోపించారు. దీనిపై గురువారం ఆమె బంధువులు ఆందోళన చేపట్టి.. ఆస్పత్రి వర్గాలతో వాగ్వాదానికి దిగారు. ఆమె తండ్రి తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం రిమ్స్‌లో రేడియాలజీ విభాగంలో టి.స్పందన పీజీ చేస్తున్నారు. ఆమెకు జ్వరం రావడంతో ఈ నెల 26న రామ్‌నగర్‌లోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. నాలుగు రోజుల తర్వాత రూ.2లక్షల బిల్లు వేసి, చెల్లించాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. జ్వరం ఏమాత్రం తగ్గలేదని.. ఇంజక్షన్లు కూడా తెలియని కంపెనీలవి వేశారని అతను ఆరోపించారు. 'వైద్యం చేసిన తర్వాత కొద్ది రోజులకు నయం అవుతుంది. ఆస్పత్రిలో వైద్యం చేసుకోవడం ఇష్టం లేకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. బిల్లు ఇంకా చెల్లించలేదు' అని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

ప్రైవేటీకరణతో కార్మికుల భవిష్యత్తు అంధకారం

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేస్తూ కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 777వ రోజు గురువారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు అన్యాయం చేస్తూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతిలోకి ఇస్తే కార్మికులు భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజల ఆగ్రహంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పుతామని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
✆ 9398184202, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
✆ 9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com